# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

కాకినాడలో సరస్వతీ గానసభలంటే అక్షరాలా గానసరస్వతి ఆనాటి హేమాహేమీలతో పదిరోజులూ నవ్వుతూ కాలువతీర్చి వెళ్ళిపోయేది.

మర్నాడు ఒక సినిమా హాల్లో వేదుల సత్యనారాయణ శాస్త్రిగారికి సన్మానం.

నేపధ్య రచన అంతా ఎం. వి. శాస్త్రి గారిది.

సూత్రధారులు శ్రీ కృష్ణశాస్త్రి. పారిపార్శ్వకులు పద్మరాజు వగైరా.

అప్పటి విద్యామంత్రి పట్టాభి రామారావుగారు అధ్యక్షులు. హాలుకు వెళ్ళే తోవపొడుగునా ఎఱ్ఱటోపీలు చూస్తే— సాహిత్యం భయపడి నక్కి నక్కి వెళ్ళి సినీమా హాల్లో తల దాచుకున్నట్టుంది.

రంగస్థలంలో ప్రముఖులు ఆసీనులయి ఉన్నారు. ప్రారంభకులు శ్రీమాన్ అనంత కృష్ణశర్మగారు. ప్రక్కనె ఆనాటి 'పెండ్లికొడుకు' వేదుల. చూపుడువేలితోనే అన్నిపన్లూ కంజాయింపు చేస్తూ కృష్ణశాస్త్రి గారు నిలబడి పరఖాయిస్తున్నారు.

ఆయన ప్రక్క - నీడలా నారాయణ బాబు!

హాలు విండిపోయింది.

ఆరోజు అక్కడ ఆ సభ ఉందని తెలియదు. పాలీటెక్నిక్ స్కూలువాళ్ళు వార్షికోత్సవమని పిలిస్తే వెళ్ళాను. ఊళ్ళోకి వెళితే వేదుల సన్మానం అని తెలిసింది. నేనూ వెళ్ళి సభలో ఒక మూల ఒదిగి కూచున్నాను. కృష్ణశాస్త్రిగారి దేగకన్ను నామీద పడింది.

మైకులో 'ఫలానావారు సభలో అదిగో అక్కడ ఉన్నారు. వేదిక మీదికి రావాలి' అని కృష్ణశాస్త్రిగారి కేక.

ఇక తప్పేదిలేదు. వెళ్ళాను.

ఛోటా బడా సాహిత్యారాధకులతో వేదిక కిటకిటలాడిపోయింది. 'ఆంధ్ర కవిగాని'కల్లా ఆ గండం తప్పలేదు.

కాటూరి వెంకటేశ్వరరావుగారు ఎలా తప్పించుకున్నారో తెలియదు. ఆయన కృష్ణశాస్త్రిగారిని మించిన లౌక్యుడుగదా! మొరాయించి ఏ పక్క కూర్చున్నారో తెలియలేదు.

సభ బ్రహ్మాండంగా మొదలయింది.

వేదులకు కాశ్మీర శాలువా కప్పారు. ఆయన దాన్ని అనంతకృష్ణ శర్మగారికి కప్పి నమస్కారం చేశారు. చూడడానికి చాలా ముచ్చటనిపించింది.

"అసలే మతిలేని నాడికి బహుమతులెందు"కని వేదుల చమత్కరించగా-నారాయణబాబు విద్యామంత్రితో విశ్వవిద్యాలయాల్లో వాడుక భాషను ఆధికారికం చెయ్యమని ఆవేశం, ఆక్రోశం, అభినివేశం, కలిపికొట్టాడు.

## తీగ తెగింది

సభ సమాప్తమయింది.

అసలు పెళ్ళిలో - రెండోవాడి ఒడుగులా - ఆ సభనుంచి బయటపడ్డాం.

మేం గజ్జెసవరించవలసింది సాయంత్రం జగన్నాథపురం పాలిటెక్నిక్ స్కూల్లో.

మధ్యాహ్నం అయిదింటికి సభ ప్రారంభమై జరుగుతోంది. కార్యక్రమంలో అంతకుముందు ఎవరు మాట్లాడారో తెలియదుగాని- సభలో అడుగు పెట్టేటప్పటికి జమాశర్మగారు తెలుగులో కొంత సేపు, సంస్కృతంలో కొంత సేపు జమాయించి ప్రసంగించారు. తెలుగయినా, సంస్కృతమైనా అది ఒక వరద గోదావరి! తెల్గుకంటె సంస్కృతమే బాగా అర్థమయినట్టు సభ్యుల వికస్వర వదనాలు చెబుతున్నాయి

"కొత్తకు చోటిచ్చి పాత తప్పుకుంటుంది" అనే నా ప్రసంగం తర్వాత జరిగింది.

తదుపరి కాటూరివారు రంగంమీదకు అవతరించారు. ఆజానుబాహువు.

నిలువునా ఖద్దరు మనిషి.

కొన్ని తరాలనుంచి కవిత్వం మాసొమ్ము అనే ఠీవీ, సాహిత్యంలో నిల్పుకున్న పెద్దతనం, వెంటబడి వచ్చినట్టున్నాయి.

కూర్చొని, కొంచెం సర్దుకుని నెమ్మదిగా ఉపన్యాసానికి ఉపక్రమించారు.

ఆయన గొంతులోని చిత్రమైన జీరతను చెప్పబోయే దానిమీద తనకున్న విశ్వాసం- సభ్యుల్ని ఏకాగ్రం చేశాయి.

ఒక విషయం చెప్పి- దానికి ఉపోద్బలకంగా ఒక కథ మొదలెటారు. "పర్బత్ మే అపనా డేరా" అనే హిందీ సినీమా కథ—

ఆ చెప్పే ఒడుపులో అంతా తన్మయులై వింటున్నారు.

హఠాత్తుగా కార్యనిర్వాహకుల్లో ఒక విద్యార్థి రంగుపువ్వు బాడ్జికలవాడు వచ్చి ఆయన చేతికి ఒక చీటీ అందిచ్చాడు.

"....వెంటనే శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారి వైలెన్ కచేరీ వుంది. దయచేసి త్వరగా ముగించండి." అంత వరకూ కులాసాగా కథ చెప్పే వెంకటేశ్వరరావుగారి ముఖం గంభీరముద్ర వహించింది.

చీటీ చూడడమేమిటి- స్విచ్ వేసినట్టు టక్కున ఆపెయ్యడమేమిటి- కత్తిరించినట్టు ఎత్తుకున్న వాక్యమైనా ముగించకుండా- సభ్యులతో "ఇది సాహిత్య సభ అనుకున్నాను. పొరపాటు. సంగీత సభ అని ఇప్పుడే తెలిసింది. దానికి ముందు మా ప్రసంగాలు మంగళ వాద్యాలు అనుకోలేదు. క్షమించండి" అని చట్టున మైక్ ముందునుంచి లేచి తిరిగి చూడకుండా రోడ్డుమీదకు వెళ్ళిపోయారు.

ప్రిన్సిపాల్, సభ్యులు, నిశ్చేష్టితులయ్యారు. శ్రావ్యంగా పలికే వీణతీగ టప్పున తెగిపోయినట్టయింది.

